క్లుప్తంగా

శ్రీమఠంలో భక్తుల సందడి



శ్రీమఠం ప్రాంగణంలో ప్రదక్షిణ చేస్తున్న భక్తులు

మంత్రాలయం : రాఘవేంద్రుల దర్శనార్థం బుధవారం వేలాదిగా భక్తులు తరలివచ్చారు. కర్ణాటక, తమిళనాడు, ఆంధ్ర, తెలంగాణ ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులతో క్షేత్ర పరిసరాలు కిటకిటలాడాయి. ముందుగా గ్రామ దేవత మంచాలమ్మ సేవలో తరించారు. అనంతరం రాఘవేంద్రుల మూల బృందావనం దర్శించుకున్నారు. అలాగే ఊంజల మంటపంలో రాఘవేంద్రుల బృందావన సేవ చేపట్టి శ్రీమఠం వీదుల్లో ఊరిగించారు. బంగారు కవచ ధారణలో మూల బృందావన దర్శనం భక్తులను ఆకట్టుకుంది. శ్రీమఠం ఏఏవో మాధవశెట్టి, మేనేజర్–ఎ శ్రీనివాసరావు, అసిస్టెంట్ మేనేజర్ ఐపీ నరసింహ మూర్తి, ధార్మిక సహాయక అధికారి వ్యాస రాజాచార్ భక్తుల ఏర్పాట్లను పర్యవేక్షించారు.

రాష్ట్రస్థాయి హాకీ పోటీలకు ఎంపిక

ఆదోని సెంట్రల్: పట్టణంలోని సెయింట్ జోసఫ్ పాఠశాలకు చెందిన విద్యార్థి సి.అజయ్ రాష్ట్ర స్థాయి హాకీ పోటీలకు ఎంపికయ్యాడని హెచ్ఎం సిస్టర్ సుజనా బుధవారం తెలిపారు. ఆమె మాట్లాడుతూ అక్టోబర్‌లో కర్నూలు ఎస్‌టీబీసీ మైదానంలో జరిగిన అండర్–17 హాకీ పోటీల్లో అత్యుత్తమ ప్రతిభ చూపాడన్నారు. నవంబర్ 3 నుంచి 5వ తేదీ వరకు అనకాపల్లి జిల్లా నక్కపల్లిలో జరిగే అంతర్రాష్ట్ర హాకీ పోటీల్లో పాల్గొంటాడని చెప్పారు. ఉపాధ్యాయులు, విద్యార్థులు విద్యార్థిని అభినందించారు.

ఆటో ఢీ..కర్ణాటక భక్తుడి మృతి



వీరభద్రారెడ్డి (ఫైల్)

మంత్రాలయం : మండల కేంద్రంలోని జాతీయ రహదారిపై మంగళవారం వేకువజామున రోడ్డు ప్రమాదం చోటు చేసుకుంది. వేగంగా వస్తున్న ఆటో ఢీకొనగా కర్ణాటక పాదయాత్రికుడు మృత్యువాత పడ్డాడు. ఎస్ఐ వేణుగోపాల్‌రాజు తెలిపిన వివరాల మేరకు.. కర్ణాటకలోని శిరుగుప్ప తాలూకా కరూరు గ్రామస్తులు పాదయాత్రగా మంత్రాలయం రాఘవేంద్రస్వామి దర్శనార్థం వస్తున్నారు. స్థానిక రాఘుసుధ సమీపంలో రాంపురం గ్రామం నుంచి వేగంగా వస్తున్న ఆటో వీరభద్రారెడ్డి (44) అనే పాదయాత్ర భక్తుడిని ఢీకొట్టడంతో ఆయన తలకు బలమైన గాయమైంది. తోటి పాదయాత్రికులు, సోదరులు కారులో ఎమ్మిగనూరు ప్రభుత్వాసుపత్రికి తరలిస్తుండగా మార్గమధ్యలో ప్రాణాలు వదిలాడు. దీంతో కుటుంబ సభ్యులు కన్నీటి పర్యంతమయ్యారు. మృతుడి తమ్ముడు లోకారెడ్డి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ వివరించారు.

పెద్దచెరువు రీసర్వే నిలిపివేయాలి

ఆదోనిరూరల్ : మండలంలోని పాండవగల్లు ప్రభుత్వ పెద్ద చెరువు రీ సర్వేను నిలిపివేయాలని పెద్ద చెరువుసాధన కమిటీ కన్వీనర్ యం.తాహేర్‌వలీ, వెంకటేష్ కోరారు. ఈ మేరకు బుధవారం తహసీల్దార్ వెంకటలక్ష్మిని కలిసి వినతి పత్రం అందజేశారు. వారు మాట్లాడుతూ రీ సర్వే చేయాలని అధికారులు భావిస్తే సర్వే నంబర్ 135–1 విస్తీర్ణం 20.42 ఎకరాలకు సంబంధించి ప్రస్తుతం ఉన్న పేర్లను తొలగించి, ప్రభుత్వ చెరువుగా గుర్తిస్తే మాకు అభ్యంతరం లేదని చెప్పారు.

విద్యుత్ సమస్య పరిష్కారం

కోసిగి: మండలంలోని ఐరన్‌గల్లు గ్రామంలో విద్యుత్ సమస్యను పరిష్కరించామని సర్పంచ్ రామాంజనేయులు బుధవారం తెలిపారు. ఎస్సీ కాలనీలో విద్యుత్ స్తంభాల కొరతతో విద్యుత్ సౌకర్యం లేక స్థానికులు ఇబ్బందులు పడుతున్న విషయాన్ని ఎమ్మెల్యే వై. బాలనాగిరెడ్డి దృష్టికి తీసుకెళ్లగా ఆయన విద్యుత్ అధికారులతో చర్చించి సమస్యను పరిష్కరించాలని ఆదేశించారు. దీంతో అధికారులు కొత్త విద్యుత్ స్తంభాలు పాతి, ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు చేశారు.

ఇళ్ల నిర్మాణాలు వేగవంతం చేయాలి

మంత్రాలయం : ఇళ్ల నిర్మాణాలు వేగవంతంచేయాలని ఎంపీడీఓ మణిమంజరి సూచించారు. బుధవారం స్థానిక వైఎస్సార్ క్రాంతి పథం కార్యాలయంలో హౌసింగ్ అధికారులతో సమీక్ష సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రతి గ్రామంలోనూ ఇళ్ల నిర్మాణాలు వేగవంతం చేయాలన్నారు. నిర్లక్ష్యం చేయకుండా లబ్ధిదారులకు అవగాహన కల్పించి నిర్మాణాలు పూర్తి చేయించాలని ఆదేశించారు. ప్రభుత్వ లక్ష్యాన్ని చేరుకునేలా అందరూ శ్రమించాలని కోరారు. సమావేశంలో హౌసింగ్ డీఈ లాల్‌కృష్ణ, వర్క్ ఇన్‌స్పెక్టర్లు పాల్గొన్నారు.

కరువు మండలంగా ప్రకటించాలి

ఆదోనిరూరల్ : ఆదోని మండలాన్ని కరువు మండలంగా ప్రకటించాలని ఏపీ రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు వెంకటేశ్వర్లు కోరారు. బుధవారం స్థానిక సీఐటీయూ కార్యాలయంలో సంఘం మండల కార్యదర్శి అయ్యప్ప అధ్యక్షతన సమావేశం జరిగింది. వెంకటేశ్వర్లు మాట్లాడుతూ మండలంలో కరువు తీవ్రంగా ఉందని, ప్రభుత్వం ఇటీవల ప్రకటించిన మండలాల్లో ఆదోని, క్రిష్ణగిరి మండలాలను కరువు మండలాలుగా ప్రకటించకపోవడం అన్యాయమన్నారు. ఆదోని మండలంలోని రైతుల పరిస్థితి పరిశీలించి కరువు మండలంగా ప్రకటించి, నష్టపరిహారం అందేలా చూడాలని విజ్ఞప్తి చేశారు. ఉపాధి హామీ పనులను 200 రోజులు కల్పించాలని డిమాండ్ చేశారు. ఈ విషయంపై ఈనెల 6వ తేదీన తహసీల్దార్ కార్యాలయం ఎదుట ధర్నా చేస్తామని చెప్పారు.మండలాధ్యక్షుడు తిక్కన్న పాల్గొన్నారు.

పల్లెవించిన ఆరోగ్య సురక్ష

- నియోజకవర్గంలో 77 జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరాలు
- 24,112 మందికి పరీక్షలు
- సంతోషం వ్యక్తం చేస్తున్న పల్లెవాసులు





మంత్రాలయంలో జరిగిన వైద్య శిబిరంలో గర్భిణితో మాట్లాడుతున్న ఎమ్మెల్యే వై.బాలనాగిరెడ్డి, కోసిగి మండలం సాతనూరులో ఓపి చూస్తున్న దృశ్యం

మంత్రాలయం : పల్లెల్లో ఎవరికైనా జ్వరం వస్తే పట్నం వైపు పరుగు.. ప్రైవేటు ఆసుపత్రుల్లో చికిత్స.. రోగాలకు వేలకు వేలు ఖర్చు.. కళ్లకు నీళ్లు తెప్పించే ప్రయాసలు.. నిన్నటి వరకు పల్లెవాసులు పడిన యాతన ఇది. రోజులు మారాయి. సరికొత్త ప్రభుత్వ నిర్ణయంతో వైద్య కష్టాలు తీరాయి. ఖరీదైన వైద్యం సైతం పల్లె పంచన వాలింది. ఫ్యామిలీ డాక్టర్ రూపంలో మంచం వద్దకే వైద్య సేవలు చేరువయ్యాయి. 104 అంబులెన్స్‌తో నెలలో రెండు పర్యాయాలు చికిత్సలు దరికి వచ్చాయి. ప్రయోగాత్మకంగా జగనన్న ఆరోగ్య సురక్షతో పల్లె వైద్యంలో విప్లవం చోటు చేసుకుంది. ఇక వైద్యానికి పరుగులు, ప్రయాసలు పడాల్సిన దుస్థితిని రూపుమాపింది. పల్లెల్లో ఉన్న రోగుల వివరాలను ఇంటింటికీ తిరిగి తెలుసుకొని నిర్దేశిత రోజు వైద్య శిబిరం ఏర్పాటు చేసి స్పెషలిస్టు వైద్యులతో వైద్య పరీక్షలు చేయించి ఉచితంగా మందులు అందజేశారు. పరిస్థితి విషమంగా ఉన్న వారిని ఆరోగ్యశ్రీ నెట్‌వర్క్ ఆసుపత్రులకు రెఫర్ చేశారు. జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమంపై ప్రజల నుంచి హర్షం వ్యక్తమవుతోంది.

నియోజకవర్గంలో..

మంత్రాలయం నియోజకవర్గంలో నెలరోజుల పాటు జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరాలు నిర్వహించారు. ప్రతి గ్రామ సచివాలయాన్ని యూనిట్‌గా తీసుకుని క్యాంపులు ఏర్పాటు చేశారు. నియోజకవర్గంలో మొత్తం 77 క్యాంపులు నిర్వహించారు. పెద్దకడబూరులో 17, మంత్రాలయంలో 20, కోసిగిలో 18, కౌతాళంలో 21 శిబిరాలు ఏర్పాటు నెలకొల్పి మొత్తం 24,112 మందికి వైద్య పరీక్షలు చేపట్టారు. అందులో మహిళలు 13,770 మంది, పురుషులు 10,173 మంది సేవలు పొందారు. ఒక్కో మండలంలో రెండు టీములుగా ఏర్పడి శిబిరాలు నిర్వహించారు.

పల్లెవాసుల హర్షం..

పల్లె ఆరోగ్యంగా ఉండాలన్న లక్ష్యంతో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అడుగులు వేయడంపై సర్వత్రా హర్షం వ్యక్తం చేస్తున్నారు. ముఖ్యంగా పల్లెల్లో రోగుల వివరాలు తెలుసుకునేందుకు జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం చేపట్టడం అద్భుతంగా ఉందంటున్నారు. గ్రామాల్లో ఈ వైద్య శిబిరాలు ఎంతగానో ఉపయోగపడ్డాయని అభిప్రాయపడుతున్నారు. దీర్ఘకాలిక వ్యాధిగ్రస్తుల వివరాలు, పౌష్టికాహార లోపం, గుండె జబ్బులు ఉన్న వారి సంఖ్య సైతం క్యాంపుల్లో తెలిసిపోయింది. అత్యవసర మెరుగైన చికిత్సల కోసం వందలాది మందిని ఆరోగ్య శ్రీ ఆసుపత్రులకు రెఫర్ చేయడం సంతోషకరమంటున్నారు. ఇలాంటి కార్యక్రమాలు ప్రజలకు ఎనలేని మేలు చేస్తాయని పేర్కొంటున్నారు.

జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరాల్లో చికిత్స పొందిన వారి వివరాలు..

మండలం	ఓపీ	మహిళలు	పురుషులు	బాలింతలు /గర్భిణులు	చిన్నారులు	కంటి పరీక్షలు	కళ్లద్దాల పంపిణీ
మంత్రాలయం	6,798	3,744	2,885	455	419	795	360
పెద్దకడబూరు	4,780	2,890	1,890	523	342	565	127
కోసిగి	6,523	3,826	2,697	457	941	538	215
కౌతాళం	6,011	3,310	2,701	1,168	415	1,188	451
మొత్తం	24,112	13,770	10,173	2,603	2,117	3,086	1,153

చాలా మంచి కార్యక్రమం



తమలాంటి వయసు మళ్లిన వాళ్లు జబ్బు చేస్తే వైద్యం పొందేందుకు నానా ఇబ్బందులు పడేవాళ్లం. పట్నం వెళ్లి వేలాది రూపాయలు ఖర్చు చేసుకునే పరిస్థితి. గతంలో మా కష్టాలు ఎవరూ పట్టించుకోలేదు. ప్రస్తుతం జబ్బు చేస్తే చాలు ఇంటి ముంగిటకు డాక్టర్లు వస్తున్నారు. ఉన్న చోటనే మాకు పరీక్ష చేసి మందులు ఇస్తున్నారు. జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమంతో ఎంతో మందికి మేలు జరిగింది. ముసలోళ్లు ఎంతో సంతోషపడుతున్నారు. నేను కూడా మోకాళ్ల నొప్పులతో బాధపడుతున్నా.. క్యాంపులో మందు బిళ్లలు ఇచ్చారు.

– మజ్జిగ తాయప్ప, అర్లబండ

వైద్య రంగంలో విప్లవం



ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి విద్య, వైద్య రంగాలపై ప్రత్యేక శ్రద్ధ చూపుతున్నారు. ముఖ్యంగా వైద్య రంగంలో విప్లవాత్మక మార్పులు తెచ్చారు. పల్లెల్లో వైద్య సేవలు మెరుగు పరిచి కొత్త విధానాన్ని అమల్లోకి తీసుకొచ్చారు. లక్షలాది మంది ప్రజలు జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమంపై సంతోషం వ్యక్తం చేస్తున్నారు. ప్రతి పక్షాలు సైతం మెచ్చుకునేలా వైద్య సేవలు అందించడం నిజంగా అభినందనీయం.

– వై. ప్రదీప్‌కుమార్‌రెడ్డి, వైఎస్సార్‌సీపీ రాష్ట్ర యూత్ కమిటీ సభ్యుడు

ఘనంగా రాష్ట్ర అవతరణ దినోత్సవం



ఎమ్మెల్యే నివాసం వద్ద అమరజీవికి నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే, ఎమ్మెల్సీ

ఆదోనిటౌన్ : అమరజీవి పొట్టి శ్రీరాములును యువత ఆదర్శంగా తీసుకోవాలని ఎమ్మెల్యే సాయి ప్రసాద్‌రెడ్డి పిలుపునిచ్చారు. ఆంధ్ర రాష్ట్ర అవతరణ దినోత్సవ వేడుకలను బుధవారం ఘనంగా జరుపుకున్నారు. ఎమ్మెల్యే నివాసం వద్ద అమరజీవి చిత్రపటానికి ఎమ్మెల్యే, ఎమ్మెల్సీ, చైర్‌పర్సన్, వివిధ కార్పొరేషన్ల డైరెక్టర్‌లు పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో పార్టీ పట్టణాధ్యక్షుడు దేవా, పోలీసు హౌసింగ్ కార్పొరేషన్ డైరెక్టర్ రేణుక, నాయకులు తిమ్మప్ప, గురునాథ్‌రెడ్డి, సందీప్‌రెడ్డి, గిడ్డయ్య, రామలింగేశ్వరయాదవ్, ఆంధ్రా లక్ష్మన్న, వేణు, కోదండ, రహీం, సిద్ధ పాల్గొన్నారు.

కౌతాళం: మండలంలో బుధవారం రాష్ట్ర అవతరణ దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఇన్‌చార్జ్ ప్రిన్సిపాల్ రవికుమార్ ఆధ్వర్యంలో శ్రీరాములు చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం ఆయన గురించి వివరించారు. అధ్యాపకుల శ్రీనివాసరెడ్డి, సంధ్యారాణి, ప్రకాశ్‌రాజ్, రవి, నరసింహులు, పరమేశ్వర్‌రెడ్డి పాల్గొన్నారు.

ఆదోని సెంట్రల్: రాష్ట్ర అవతరణ దినోత్సవ వేడుకలను మిల్టన్ గ్రామర్ పాఠశాలలో బుధవారం ఘనంగా జరుపుకున్నారు. పొట్టి శ్రీరాములు చిత్ర పటానికి కరస్పాండెంట్ రమేష్ బాబు, సీఈఓ వెంకటేశులు, వైస్ ప్రిన్సిపాల్ రంగస్వామి, సుశీల తదితరులు నివాళులర్పించారు.

ఆదోనిఅర్బన్ : ఆర్యవైశ్య అఫీషియల్స్ అండ్ ప్రొఫెషనల్ అసోసియేషన్ (అవోపా) మరియు అవోపా మహిళా విభాగ్ ఆధ్వర్యంలో బుధవారం ఆంధ్రరాష్ట్ర అవతరణ దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ముందుగా పొట్టి శ్రీరాములు విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం విశ్వ హిందూ పరిషత్ కార్యాలయం వద్ద సతీష్ మెడిక్యూర్ సెంటర్‌లో ఉచిత జనరల్ చెకప్ మెడికల్ క్యాంపు నిర్వహించినట్లు పట్టణాధ్యక్షుడు వంకదారు శ్రీనాథ్‌గుప్తా తెలిపారు. దాదాపు 153 మందికి బీపీ, షుగర్, గ్రూపింగ్ లాంటి వైద్య పరీక్షలు ఉచితంగా చేయించారు. కార్యదర్శి మిర్యాల శ్రీధర్, సభ్యులు ప్రతాప్, ఈరన్నశెట్టి, రఘు, సంగీత, మమతాశ్రీ, బిందు, గీత పాల్గొన్నారు.



పొట్టి శ్రీరాములు చిత్రపటానికి నివాళులర్పిస్తున్న దృశ్యం



పొట్టి శ్రీరాములు విగ్రహానికి నివాళులర్పిస్తున్న అవోపా సభ్యులు

గ్రామాల అభివృద్ధి వైఎస్సార్‌సీపీతోనే సాధ్యం



మదిరెలో సంక్షేమ పథకాల గురించి ప్రజలకు వివరిస్తున్న ఎమ్మెల్యే సాయిప్రసాద్‌రెడ్డి

ఆదోనిరూరల్ : గ్రామాభివృద్ధి వైఎస్సార్‌సీపీతోనే సాధ్య పడిందని, గడప గడప మన ప్రభుత్వం కార్యక్రమంతో ప్రజా సమస్యలు పరిష్కారమవుతాయని ఎమ్మెల్యే సాయిప్రసాద్‌రెడ్డి పేర్కొన్నారు. బుధవారం మండలంలోని మదిరె గ్రామంలో బుధవారం గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే గ్రామంలో ప్రతి గడప తిరుగుతూ సమస్యలను అడిగి తెలుసుకున్నారు. అలాగే పథకాల అమలు తీరుపై ఆరా తీశారు. వివిధ సంక్షేమ పథకాల ద్వారా గ్రామస్తులకు రూ.32.20 కోట్ల మేర నేరుగా వారి ఖాతాల్లో జమ చేశామని వివరించారు. సీసీ రోడ్లు, డ్రైనేజీల నిర్మాణాలకు అంచాలు రూపొందించాలని అధికారులను ఆదేశించారు.త్వరలో రెండు సచివాలయ నిర్మాణం పనులు, రెండు రైతుభరోసా కేంద్రాలను ప్రారంభిస్తామని చెప్పారు. ఎమ్మెల్సీ మధుసూదన్, కార్పొరేషన్ డైరెక్టర్ రేణుక, ఎంపీడీఓ గీతావాణి, ఇన్‌చార్జి ఈఓపీఆర్డీ నాగరాజు, హౌసింగ్‌బోర్డు అధికారి తిక్కన్న, సర్పంచ్ నారాయణ, ఎంపీటీసీ మహాదేవి, మార్కెట్‌యార్డు వైస్ చైర్మన్ కామాక్షి తిమ్మప్ప, పార్టీ జిల్లా ఎగ్జిక్యూట్ మెంబర్ శ్రీలక్ష్మి, నాయకులు రామలింగేశ్వరయాదవ్, గోవర్ధన్‌రెడ్డి, చంద్రశేఖర్‌రెడ్డి, లక్ష్మీకాంత్‌రెడ్డి, శీనప్ప, దేవేంద్ర, హనుమంతు, తిక్కన్న, అంజి, శంకర్, పరికల నారాయణ, గిడ్డయ్య, చిన్న ఈరన్న పాల్గొన్నారు.

అన్ని వార్డుల అభివృద్ధే లక్ష్యం

ఆదోనిటౌన్ : మున్సిపాలిటీ పరిధిలోని అన్ని వార్డులను అభివృద్ధి చేయడమే వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ లక్ష్యమని ఎమ్మెల్యే సాయిప్రసాద్‌రెడ్డి అన్నారు. బుధవారం 36వ వార్డు టీజీఎల్ కాలనీ, మేదర్‌గేరి ప్రాంతాల్లో సచివాలయాల అభివృద్ధి నిధుల రూ.40 లక్షలతో నిర్మించిన సీసీ రోడ్లను ప్రారంభించి, శిలాఫలకాలను ఆవిష్కరించారు. ఎమ్మెల్సీ డాక్టర్ మధుసూదన్,, చైర్‌పర్సన్ శాంత, కమిషనర్తో కలిసి ప్రారంభించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ పట్టణాన్ని ఆదర్శంగా తీర్చిదిద్దుతామని చెప్పారు. నాలుగున్నరేళ్ల పాలనలో దాదాపు రూ.200 కోట్లతో పట్టణంలో వాడవాడలా సీసీ రోడ్లు, బీటీ రోడ్లు, మురుగు కాలువలు, తాగునీటి పైపులైన్లు, విద్యుత్, కల్వర్టులు తదితర పనులు చేపట్టామని వివరించారు. అయితే ప్రతిపక్షాలు అభివృద్ధిని చూసి ఓర్వలేకనే విమర్శలు చేస్తున్నాయని మండిపడ్డారు. కౌన్సిలర్ సందీప్‌రెడ్డి, ఎంఈ రాధాకృష్ణ, మార్కెట్‌యార్డు వైస్ చైర్మన్ తిమ్మప్ప, రామలింగేశ్వరయాదవ్ పాల్గొన్నారు.



శిలాఫలకాన్ని ఆవిష్కరించిన ఎమ్మెల్యే, ఎమ్మెల్సీ, కమిషనర్, కౌన్సిలర్లు

ప్రజారోగ్యానికి ప్రభుత్వ రక్ష



మందుల పంపిణీని పరిశీలిస్తున్న మున్సిపల్ చైర్‌పర్సన్ బోయ శాంత



వృద్ధురాలికి కంటి పరీక్షలు చేస్తున్న డాక్టర్, పరిశీలిస్తున్న కమిషనర్, అసిస్టెంట్ కమిషనర్

ఆదోనిటౌన్ : ప్రజా ఆరోగ్యాన్ని రక్షించేందుకే ప్రభుత్వం జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని నిర్వహిస్తుందని మున్సిపల్ కమిషనర్ రఘునాథ్‌రెడ్డి, అసిస్టెంట్ కమిషనర్ అనుపమ తెలిపారు. జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం బుధవారం ముగిసింది. పట్టణంలోని 36, 42 వార్డులకు సంబంధించి భీరప్ప కల్యాణ మండపం, 9వ వార్డుకు సంబంధించి అండర్‌పేట ఉర్దూ బాలికల ఉన్నత పాఠశాల ఆవరణలో వైద్యశిబిరాలు ఏర్పాటు చేశారు. ఆరుగురు డాక్టర్లు శిబిరంలో పాల్గొని పేదలకు పరీక్షలు చేసి మందులు పంపిణీ చేశారు. శిబిరాన్ని చైర్‌పర్సన్ బోయ శాంత సందర్శించారు.

ఆదోనిరూరల్ : ప్రభుత్వం ప్రజలకు అందిస్తున్న జగనన్న సురక్ష ఆరోగ్య వైద్యశిబిరం సద్వినియోగం చేసుకోవాలని సర్పంచ్ జి.రామకృష్ణారెడ్డి అన్నారు. బుధవారం మండలంలోని చిన్నహరివాణం గ్రామంలో సర్పంచ్ రామకృష్ణారెడ్డి, ఎంపీటీసీ కె.వీరేష్‌రెడ్డి ఆధ్వర్యంలో జగనన్న ఆరోగ్య సురక్ష వైద్యశిబిరాన్ని నిర్వహించారు. వైద్యులు రాధా, నీలోఫర్, మయూర్‌కుమార్, శశిధర్‌రెడ్డి పాల్గొని 517 మందికి వైద్యసేవలందించి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. అంగన్‌వాడీ కార్యకర్తలు ఏర్పాటు చేసిన పౌష్టికాహార స్టాళ్లను అధికారులు పరిశీలించారు. ఈఓపీఆర్డీ నాగరాజు, ఎంపీహెచ్ఓ లక్ష్మీనారాయణ పాల్గొన్నారు.



చిన్నహరివాణంలో వైద్య పరీక్షలు చేస్తున్న వైద్య సిబ్బంది

పోషణ కిట్లతో సంపూర్ణ ఆరోగ్యం

కోసిగి: గర్భిణులు, బాలింతల ఆరోగ్యం కోసమే ప్రభుత్వం పోషణ కిట్లను అందజేస్తుందని స్త్రీ శిశు సంక్షేమ శాఖ సూపర్ వైజర్ విజయకుమారి తెలిపారు. బుధవారం మండలంలోని జంపాపురం 3, 5వ అంగన్‌వాడీ కేంద్రాల్లో అంగన్‌వాడీ కార్యకర్తలు లలిత, వనజాక్షి ఏర్పాటు చేసిన మొదటి గర్భవతి నమోదు, అన్నప్రాశన కార్యక్రమం చేపట్టారు. నాడు–నేడు ఏఈ రంగరాజు పాల్గొన్నారు.

నీటి ఎద్దడి తలెత్తనీయం

కౌతాళం: తాగునీటి ఎద్దడి తలెత్తకుండా చూస్తామని గుడికంబాలి గ్రామ సర్పంచ్ సిద్దేశ్ అన్నారు. గ్రామ చావిడి వద్ద ఉన్న బోరుకు సుమారు రూ.లక్ష పంచాయితీ నిధులతో మోటార్ ఏర్పాటు చేసినట్లు తెలిపారు. గ్రామంలో బోరు ఉన్నప్పటికీ మోటార్ లేక పోడంతో నీటి సరఫరా కావడం లేదన్నారు. సమస్యను ఎమ్మెల్యే బాలనాగిరెడ్డి దృష్టికి తీసుకెళ్లగా మోటారు అమర్చాలని సూచించారు. దీంతో బుధవారం మోటార్ బిగించి నీటిని సరఫరాను ప్రారంభించారు.

పోలింగ్ కేంద్రాల తనిఖీ

ఆదోనిరూరల్ : ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు స్పెషల్ సమ్మరీ రివిజన్–2024లో భాగంగా ఆదోని నియోజకవర్గంలోని పలు పోలింగ్ కేంద్రాలను ఎన్నికల అధికారి, సబ్‌కలెక్టర్ అభిషేక్‌కుమార్ బుధవారం తనిఖీ చేశారు. ఈ మేరకు పట్టణంలోని మున్సిపల్ కార్యాలయంలోని పోలింగ్ కేంద్రాలు, శంకర్‌నగర్‌లోని 23వ సచివాలయం, న్యూ శ్రీ చైతన్య ఇంగ్లిష్ మీడియం స్కూల్, ఆర్ఆర్ లేబర్ కాలనీలోని మున్సిపల్ అప్పర్ ప్రైమరీ స్కూల్, మున్సిపల్ ఎలిమెంటరీ స్కూల్, ప్రభుత్వ డిగ్రీ కాలేజీ (ఓల్డ్ వైఎంకే స్కూల్), మహాత్మా గాంధీ గుజరాతీ ఎయిడెడ్ స్కూల్, మొత్తం 18 పోలింగ్ కేంద్రాలను తనిఖీ చేశారు. పోలింగ్ కేంద్రాల్లో వసతులు కల్పించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. ఏఈ ఆర్వోలు రజనీకాంత్‌రెడ్డి, హిజాజ్ అహ్మద్, బీఎల్ఓలు ఉన్నారు.



అధికారులకు సూచనలిస్తున్న సబ్ కలెక్టర్ అభిషేక్‌కుమార్

వేకువనే పింఛన్ల పంపిణీ



మరాఠీగేరిలో నరసన్నకు పింఛన్ పంపిణీ చేస్తున్న వలంటీర్ రేణుక



వీరశైవ కల్యాణ మండపం వద్ద నాగమ్మకు పింఛన్ పంపిణీ చేస్తున్న కౌన్సిలర్ నాగరత్న, సచివాలయం సిబ్బంది

ఆదోనిటౌన్ : పట్టణంలోని 42 వార్డుల్లో బుధవారం తెల్లవారక ముందే పింఛన్ల పంపిణీ మొదలైంది. వలంటీర్లు, వార్డు సచివాలయ వెల్ఫేర్ సెక్రటరీలు, కౌన్సిలర్లు లబ్ధిదారులకు పింఛన్లు పంపిణీ చేశారు. పట్టణంలో 17,184 మంది పింఛన్‌దారులు ఉన్నారు. అందులో 12,027 మందికి పంపిణీ చేసి 70 శాతం పూర్తి చేశారు. 1– 5వ తేదీలోపు పింఛన్ల పంపిణీ జరుగుతుందని, లబ్ధిదారులందరికీ అందజేయాలని కమిషనర్ రఘునాథ్‌రెడ్డి సూచించారు.

మధ్యంతర భృతి ప్రకటించాలి

కోసిగి: ఉపాధ్యాయులకు 25 శాతం మధ్యంతర భృతి ప్రకటించాలని డీటీఎఫ్ జిల్లా కార్యదర్శి గంగాధర్ కోరారు. బుధవారం మండలంలోని జుమ్మాల దిన్నె, వందగల్లు, దుద్ది గ్రామాల పాఠశాలలో డీటీఎఫ్ సభ్యత్వ నమోదు కార్యక్రమం చేపట్టారు. ఆయన మాట్లాడుతూ కొత్తగా అమలులోకి తెచ్చిన జీపీఎస్‌ను రద్దు చేసి ఓపీఎస్సీ పునరుద్ధరించాలని కోరారు. గత వేసవిలో స్పాట్‌లో పాల్గొన్న ఉపాధ్యాయులకు రెమ్యూనరేషన్ వెంటనే చెల్లించాలన్నారు. కార్యక్రమంలో జిల్లా బాధ్యులు పీజీ వెంకట్రాముడు, ఖాజా బాషా, గొట్ల చంద్రశేఖర్ పాల్గొన్నారు.

కర్ణాటక మద్యం స్వాధీనం

మంత్రాలయం : కర్ణాటక రాష్ట్రం గిల్లెసూగూరు క్యాంపు గ్రామం నుంచి అక్రమంగా తరలిస్తున్న కర్ణాటక మద్యాన్ని మాధవరం పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. ఎస్ఐ కిరణ్‌బాబు తెలిపిన వివరాల మేరకు బుధవారం రచ్చుమర్రి గ్రామానికి చెందిన బోయ ఈరన్న మాధవరం గ్రామ జెడ్పీ ఉన్నత పాఠశాలలో కర్ణాటక మద్యంతో పట్టుబడ్డారు. నిందితుడి నుంచి 192 ఒరిజినల్ చాయిస్ టెట్రా ప్యాకెట్లు స్వాధీనం చేసుకున్నారు. నిందితుడిని అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు ఎస్ఐ వివరించారు. దాడుల్లో కానిస్టేబుళ్లు వీరాంజనేయులు, భాస్కర్ ఉన్నారు.


కర్ణాటక మద్యం పట్టివేత

కౌతాళం: వల్లూరు గ్రామం వద్ద తుంగభద్ర నది దాటించిన కర్ణాటక అక్రమం మద్యంను స్వాధీనం చేసుకున్నామని సీఐ ఏరిషావలి, ఎస్ఐ నరేంద్ర కుమార్ రెడ్డి తెలిపారు. ఎస్ఐ మాట్లాడుతూ..బుధవారం కోసిగి మండలం కడిదొడ్డి గ్రామానికి చెందిన గోతులదొడ్డి బెండప్ప, గౌడయ్యగారి తిమ్మయ్య కౌతాళం, కోసిగి మండలాలకు సరఫరా చేయడానికి అక్రమంగా తెస్తున్న కర్ణాటక మద్యాన్ని సిబ్బందితో కలిసి దాడి చేసి వారిని పట్టుకుని 15 బాక్స్‌లు మొత్తం 1,440 ఒరిజినల్ చాయిస్ డీలక్స్ విస్కీ టెట్రా ప్యాకెట్లను, మద్యం తీసుకుని రావడానికి ఉపయోగించిన తెప్ప, బైక్‌ను సీజ్ చేసినట్లు చెప్పారు.

ఘనంగా మాబుసుభాని ఉరుసు

కోసిగి: మండల కేంద్రంలోని రంగప్ప గట్టు వద్ద వెలసిన మాబుసుభాని ఉరుసును బుధవారం ఘనంగా నిర్వహించారు. ముందుగా పురవీధుల్లో జెండాను ఊరేగింపుగా దర్గా చెంతకు చేర్చి ముస్లింలు ప్రత్యేక ఫాతెహాలు నిర్వహించారు. దర్గా నిర్వాహకులు చందా ఉసేన్, గౌస్ పీర్ ఆధ్వర్యంలో ఉరుసు వేడుకలు జరిగాయి. భక్తులకు దర్గా నిర్వాహకులు అన్నదానం చేశారు.

ఆకట్టుకున్న రాఘవుడి నాటక ప్రదర్శన



రాఘవేంద్రుల వేషధారణలో నాటక ప్రదర్శన



ప్రదర్శనను తిలకిస్తున్న భక్తులు

మంత్రాలయం : రాఘవేంద్రుల జీవిత చరిత్రపై తమిళుల నాటక ప్రదర్శన భక్తులను ఆకట్టుకుంది. బుధవారం రాత్రి శ్రీమఠం యోగీంద్ర మంటపంలో తమిళులు రాఘవేంద్రుల జీవిత చరిత్ర ఆధారంగా నాటక ప్రదర్శన చేపట్టారు. రాఘవేంద్రుల అవతారాలు, తల్లిదండ్రులు, విద్యాభ్యాసం, పరిమళాచార్యులుగా బిరుదు పొందడం, సన్యాస స్వీకరణ, చూపిన మహిమలు, బృందావన ప్రవేశం కళ్లకు కట్టినట్లు ప్రదర్శించారు. అనంతరం శ్రీమఠం పీఠాధిపతి సుబుధేంద్రతీర్థులు కళాకారులను ఆశీర్వదించారు.

హిందూ సంప్రదాయానికి ఆనవాళ్లు

నాటకాలు, హరిదాస సాహిత్యాలు, కీర్తన రచనలు, భజనలు, కళా ప్రదర్శనలు హిందూ సంప్రదాయానికి ఆనవాళ్లుగా నిలుస్తున్నాయి. సంస్కృతిని ఇనుమడింపజేసేందుకు ఇలాంటి కళలు ఎంతో ఆవశ్యకరం. నాటకాల ద్వారానే చలన చిత్రాలు పుట్టుకొచ్చాయి. తమిళనాడు కళాకారులు రాఘవేంద్రుల జీవిత చరిత్ర నాటకాన్ని ప్రదర్శించడం సంతోషకరం.

– సుబుధేంద్రతీర్థులు